కథానిక

# అమృతత్వం

"అవంతి"

కొన్ని వందలసంవత్సరాలనాటి కథనం. తక్షశిలా నగరంలోఒకవిశాలమైనసౌధంలోనివసిస్తున్నాడు, వయసు మరలిన వేదాంతి- రసాయనికశాస్త్రజ్ఞుడు అయిన ఆనందమిహిరుడు. అతని పరిశోధనశాలకు యితరులెవరికీ ప్రవేశంలేదు. అంతమాత్రంచేత అతడు బయటి ప్రపంచకముతో సంబంధము లేకుండా నివసిస్తున్నాడనుకోడానికి వీలులేదు. నగరములోని కొన్ని ప్రసిద్ధకుటుంబాలకు చెందిన ఏడుగురు యువకులను శిష్యులుగా స్వీకరించి, వారికి ఆధ్యాత్మిక తార్కిక విజ్ఞానాలు నేర్పుతున్నాడు. కాని వారికి రససిద్ధికి సంబంధించిన తన ప్రయత్నాలూ, ఫలితాలూ మాత్రం తెలియనివ్వలేదు.

ఒకరోజు శిష్యులందర్నీ తన రహస్య రసాయన శాలకు పిలిచేడు. వారు సంభ్రమాశ్చర్యాలతో ప్రవేశించారు. ఆనందమిహిరుడు, కుర్చీనుండి లేచి, ఒక బల్లవెనుక నిలబడి వున్నాడు. బల్లమీద ఒక పోలికగానున్న ఏడు స్ఫటికపు పాత్రలు పరిశుద్ధ జలంలాంటి ద్రవపదార్థంతో నిండబడివున్నాయి.

"ఒక ముఖ్యమైన విషయం మీతో చర్చించడానికి పిలిచేనీ రోజున మిమ్మల్నిక్కడకు. ఇంతవరకూ శాస్త్రజ్ఞులెవరూ ఛేదించజాలని ప్రకృతి రహస్యాలను చాలావాటిని నేను సాధించానని బలమైన ప్రవాదం వున్నమాట మీకుకూడా తెలుసును. ఆ ప్రవాదం పూర్తిగా అసత్యంకాదు. నేను జీవితంలో ఆశించిన చాలావాటిలో విఫలుడి నయ్యేను. సంజీవి సంపాదించలేకపోయేను. రససిద్ధి నాకు దుర్లభమే అయింది. తిరస్కరణీవిద్య, పరకాయప్రవేశం- వాటిదగ్గరకుకూడా చేరలేకపోయేయి నా పరిశోధనలు. అయితే, నేను నూతన ప్రాణప్రతిష్ఠ చేయలేకపోవచ్చును కాని, జీవితం శాశ్వతం చేసే సూత్రం-జీవామృతం-కనుగొన్నాను.

శిష్యుల ముఖభావాలను పరిశీలించడానికి తన వాక్ప్రవాహాన్ని ఆపేడు ఆచార్యుడు. అత్యాశ్చర్యము, గురువు మాటలలో తిరుగులేని నమ్మకం, ఆ మహాద్భుత పరిశోధనా ఫలితానికి తాముకూడా భాగస్వాములు కావచ్చుననే ఆశ, వారిలో గోచరించేయి.

"మీకిష్టమైతే ఆ రహస్యం మీకు తెలియచేస్తాను." ఆ విషయంలో వారి యిష్టంగురించి అనుమానానికి ఆస్కారం ఎంతమాత్రం లేదని ఐక్యకంఠంతో తెలియజేసేరు.

"అయితే వినండి! ప్రతి శాస్త్రవిజ్ఞానంలోలాగనే దీనిమూలానకూడా లాభనష్టాలున్నాయి. ఈజ్ఞానం సంపాదించడానికి కొంత త్యాగం చెయ్యవలసివుంటుంది. నేను చెప్పబోయే షరతులన్నీకూడా నా స్వకల్పితం కావనీ, యీ రహస్యం నాకు ప్రసాదించిన మానవాతీతశక్తులు నిర్బంధించినవేననీ మాత్రం జ్ఞాపకం వుంచుకోండి. ఈ జీవామృతం తినాలని నాకేమీ ఆత్రుతగాలేదు. నా యీ ఎనుబది సంవత్సరాల జీవితానుభవంవల్లా, మానవజీవిత పరిణతి పొడుగించడంకన్న, తగ్గించడమే సౌఖ్యప్రదమనే అభిప్రాయానికొచ్చేను. మీ యిరవయి సంవత్సరాల అనుభవంకూడా, మిమ్మల్నదేనిశ్చయానికి తీసికొచ్చినట్లయితే మనమంతా ధన్యులం!"

మానవ జీవితపు నిస్సారత, నిష్ఫలత, ఆడంబరం గురించి నిశితాభిప్రాయాలు వెలిపుచ్చని వాడు, వారిలో ఒకడుకూడా లేడు. ఎందుచేతనంటే, వారు నేర్చుతున్నదదే. కాని వారి అప్పటి లక్షణాలు మాత్రం ఆ భావనకు వ్యతిరేకంగా వున్నాయి. అదే తెల్పుతుంది: శాస్త్ర సూత్రాలకూ నిజ జీవితానికీ, ఆధ్యాత్మిక తర్కానికీ మానవ నైజానికీ, మధ్యనున్న అఖాతం. వారంతా, ఆ రహస్యం సంపాదించడానికి ఏ అపాయాన్నైనా ఎదుర్కొంటామనీ, ఏ షరతుకైనా అంగీకరిస్తామనీ తెలియచేశారు.

"మీ యిష్టప్రకారమే చేద్దాం. ఇప్పుడు షరతులు వినండి.

"మీలో ప్రతి ఒక్కరూ, ఏదో ఒక పాత్ర ఎన్నుకోకుండా అందుకుని వెంటనే దానిలోని ద్రవాన్ని తాగెయ్యాలి. ఈ ఏడు పాత్రలలోనూ ఒకదానిలో మాత్రమే అమృత ముంది. మిగతా ఆరింటి వస్తుతత్వం కొద్దిగా భిన్నమైనవి. నా విజ్ఞానం, నేర్పు, ఓర్పు, పూర్తిగా వుపయోగించి తయారుచేసిన ప్రాణాంతక దారుణ విషాలవి. వాటికి విరుగుడు తెలిసిన మానవుడు లేడు. మొదటిది పేగుల్ని దహిస్తుంది. రెండవది నరాలను గడ్డకట్టించి ప్రాణాలు తీస్తుంది. మూడవది యమబాధలతో మృత్యువును తెస్తుంది. నాల్గవది తాగినవాడు అదృష్టవంతుడే. ఎందుచేతనంటే అది తాగిన క్షణంలో ప్రాణం పోతుంది. ఐదవదికూడా అట్టే ఫరవాలేదు. అది తాగిన వెంటనే నిద్రలో ప్రాణాలు పోతాయి. ఆరవది తాగినవాడు నిజంగా దురదృష్టవంతుడు. అది తాగినవాడికి జుట్టూడిపోతుంది. చర్మం రాలిపోతుంది. భరించరాని బాధలతో చిరకాలం తీసుకు చనిపోతాడు. ఏడవ స్ఫటికపు పాత్రలో మీరంతా కోరే అమృతం వుంది. మీరు మీ చేతులొక్కసారిగా యిటు చాపండి. ఎన్నుకోకుండా, ఆలోచించుకోకుండా తలొక పాత్ర తీసుకుని ఖాళీ చెయ్యండి అదృష్ట దేవత మీకేపాత్ర ప్రసాదిస్తుందో!" అని ముగించేడు.

తెల్లకాగితంలాంటి ముఖాలతో, చురుకుదనం లేని కళ్లతో ఒకరి నొకరు పరికించుకున్నారు. అంతా ఒక్కసారిగా గురువుగారి ముఖం వేపు చూసేరు, యీ షరతులన్నీ హాస్యానికి చెప్పేదన్న భావం అక్కడేమన్నా కనపడుతుం దేమోనని. ఆనందమిహిరుని ముఖం గంభీరముద్ర వహించింది. చివరికి, అంతా పాత్రలకేసి చూసేరు. వాటిలో ఏమైనా తేడాలు కన్పిస్తాయేమోనని. లాభంలేదు. అవన్నీ ఒక్కలాగే వున్నాయి.

"ఏమిటి సంగతి?" ఆనందమిహిరుడు- తెచ్చిపెట్టుకొన్నదో, నిజమైనదో కాని– ఆశ్చర్యంతో అడిగేడు. "ఆలస్యం ఎందుకు? ఈపాటికప్పుడే మీలో ఆరుగురు, జీవితపు చరమదశలో కింద పడి వుంటారని ఆశించేనే!"

ఈ దెప్పిపొడుపుకూడా వారిలో చలనం కలిగించలేదు. వారిలో యిద్దరు మహాశూరులు, చేతులు సగం ముందుకు జాపేరు; కాని మిగతా వాళ్లు ముందుకు రావటంలేదని క్రీగంట కనిపెట్టి వెనక్కి తగ్గారు.

"గురువర్యా! నిస్సారమైన, క్షణికమైన యీ జీవితంమీద భ్రమ వదలలేక పోతున్నా ననుకోకండి. నామీద ఆధారపడిన ముసలి తల్లికోసం బతకాల్సిన అవసరం కనిపిస్తూంది" అన్నాడు వారిలో ఒకడు.

"నాకు పెళ్లికాని చెల్లెలుంది. ఆమె కేదో సంబంధం చూసి అత్తవారింటికి పంపించీదాకా నాది బాధ్యత" అన్నాడు రెండవ శిష్యుడు.

"అన్యాయంచెయ్యబడ్డ, ప్రాణమిత్రునికి సహాయం చెయ్యడం నా ప్రథమ కర్తవ్యం-" మూడవ శిష్యుడు.

"తప్పకుండా కసి తీర్చుకోవలసిన ప్రాణ శత్రువొకడు దాపరించేడు నాకు-" నాల్గవశిష్యుడు.

"నా జీవితం శాస్త్ర పరిశోధన కర్పించేను. ప్రకృతి రహస్యాలను ఛేదించకుండా, నా జీవితం ప్రమాదాలకు లోనుచెయ్యడం భావ్యమంటారా, మీరు?" ఐదవశిష్యుడు.

"మానవరాజ్యాన్ని చంద్రలోకంలో ప్రతిష్ఠించకుండా జీవితం చాలించడం మాటేమిటి?" ఆరవ శిష్యుడు.

"నాకు తల్లిలేదు, పెళ్లికాని చెల్లెళ్లు లేరు, శాస్త్ర పరిశోధన- చంద్రలోకంమీద కూడా నాకంత మక్కువ లేదు. కాని నా ప్రాణం, శరీరం నాకన్నిటికంటె ప్రియతమమైనవి. ఆకారణం చాలనుకుంటాను నా విషయంలో-" ఆఖరిశిష్యుడు.

"ఇంతకీ పర్యవసానం మీలో ఒక్కరుకూడా జీవామృతంకోసం సాహసించలేరన్న మాటే కదూ!", ఆనందమిహిరుడు.

శిష్యులంతా సిగ్గుతో తలకాయలు వంచుకు నిల్చున్నారు. గురువుగారి మాటల్ని కాదనలేరు. కాని ఒప్పుకోడానికి ఆత్మాభిమానం అడ్డొస్తూంది. ఇంకో మార్గంకోసం వెతుకుతున్నారు.

"మేం లాటరీ వేసుకుని ఆ ప్రకారం ఒకొక్క పాత్ర తీసుకోకూడదూ?" అనివుపాయం సూచించాడొక శిష్యుడు.

"నాకభ్యంతరంలేదు. కాని ఎవ్వరయినా తమకొచ్చిన పాత్రను మార్చి యింకొకటి తీసికొనడానికి ఏమాత్రం ప్రయత్నం చేసినా, మీకందరికీ

వినాశం సంభవిస్తుంది జాగ్రత్త!" ఆనందమిహిరుడు మళ్ళీ జ్ఞాపకం చేసేడు.

ఏడు పుల్లలు తీసికొని, అన్నీ వేరువేరు పొడుగులలో విరిచి, మామూలు ప్రకారంగా ఏరుకున్నారు. తనకంటే తన తల్లికోసం ఎక్కువ విచారిస్తున్న శిష్యుడికి అన్నిటికంటే చిన్నపుల్ల వచ్చింది. దృఢ నిశ్చయంతో గుండె రాయి చేసికొని బల్ల సమీపించేడు. చేయి సగందాకా వెళ్ళింది. కాని, రెండో పుల్ల పట్టుకుని తన ప్రక్కనే నిల్చున్న పెళ్ళికాని చెల్లెలున్న శిష్యుని వుద్దేశించి యిల్లా అన్నాడు:

"మాతాపుత్రుల సంబంధం చాలా పవిత్రమయింది. అందుచేత, మొదటి అపాయాన్ని నువ్వెదుర్కోకూడదూ?"

మాతాపుత్రుల సంబంధం పవిత్రమైనదేకాని, అన్నా చెల్లెళ్ళ సంబంధం చిరకాలముండడం సంభం కనుక, నువ్వు మొదట ప్రయత్నించడమే మంచిది" అన్నాడు రెండవవాడు.

"మీ వాదం చాలించి, ధైర్యంవుంటే పాత్రలు తీసుకోండి, లేకపోతే వెనక్కిరండి!" అన్నారు మిగతావాళ్లు.

ఇంక తప్పక, మొదటి శిష్యుడు చేయిచాపి ఒక పాత్ర తీసికొన్నాడు. ఇంతలో, ఆ పాత్రలోని ద్రవంలో ఏదో దారుణమైన రంగు కన్పించినట్లు అనుమానం తట్టింది. వెంటనే అది కింద వుంచేసి యింకో పాత్ర అందుకున్నాడు. మరుక్షణంలో మెరుపు మెరిసినట్లయింది. శిష్యులేడుగురూ, తెలివి తప్పి కింద పడిపోయేరు.

తెలివివచ్చి చూసుకునేటప్పటికి ఆనందమిహిరుని సౌధం వెలుపల కటికి నేల మీద పడివున్నారు. గురువుచెప్పిన షరతుల నతిక్రమించి యీ దుస్థితి నందినందుకు సిగ్గుపడి, యీ విషయాలన్నీ బహు నిగూఢంగా వుంచడానికి వాగ్దానాలు చేసుకొని, ఎవరిదారిన వారు పోయేరు.

ఏడుగురిమధ్య ఏ రహస్యమైనా ఎట్లా దాగగలదో యిదీ అట్లాగే అయింది. అంటే, రెండో రోజు మధ్యాహ్నానికల్లా, యావత్తు కథ తక్షశిలానగరంలోని ఆబాలగోపాలానికీ వ్యాప్తి అయిపోయింది. రాజుకూడా విన్నాడు. ఆనందమిహిరుని వద్దనుండి బలవంతంగానైనా సరే ఆ అమృతపాత్రను తీసికొనిరావలసిందని, మంత్రిని కొందరు సైనికులను పంపించేడు.

ఆనందమిహిరుని సౌధద్వారం బంధింపబడి వుంది. విరగకొట్టి లోపల ప్రవేశించేరు. విజ్ఞానవేత్త, వేదాంతి- ఆనందమిహిరుడు కుర్చీలో విగతజీవుడై పడివున్నాడు.

బల్లపై ఏడు స్ఫటికపు పాత్రలున్నాయి. వానిలో ఒకటి మాత్రం ఖాళీగావుంది. అతనిచేతిలోని భూర్జపత్రంపై, యీ విధంగా వ్రాసివుంది.

"72 సంవత్సరాలు విజ్ఞానాన్వేషణలో తనువు గడిచింది. ప్రపంచకానికిసమర్పిస్తున్నాను. నాశ్రమ ఫలితం-ఆరు దారుణవిషాలు. ఏడవదికూడ సమర్పించుకో కలిగేవాడినే కాని, వూరుకున్నాను.

"శ్మశానంలో నా దహనప్రదేశంలో ఒక బల్ల నాటి, దానిపై యీవిధంగా వ్రాయండి. ఇక్కడే దహనమొనర్చబడ్డాడు - జీవామృతం కనిపెట్టి, మానవుని దైనందిన వ్యథలూ, బాధలూ శాశ్వతం చెయ్యడానికి నిరాకరించిన ఆనందమిహిరుడు."

వారి కామాట లర్థంకాక, ఒకరిముఖా లొకరు చూసుకుంటున్నారు. ఇంతలో ప్రక్కబీరువానుండి పెద్దచప్పుడుతో కిందకుదూకింది ఒక కోతి. దాని మెరుస్తూన్న చర్మం, జీవంవొలికేకళ్లు, చురుకుతనం చూసి, వారర్థం చేసుకున్నారు. ప్రపంచకాన్ని వెక్కిరించడానికి, ఆనందమిహిరుడు, జీవామృతాన్నంతా ఆ మర్కటరాజానికి ప్రసాదించాడేమోనని.

మొత్తానికి ఎవర్ని చూసినా ఈశ్వరుడూ, ఆయన లోకమూ, దాని మార్గమూ, వీటి సంగతి మాట్లాడేవాళ్లేగాని, యీ లోకాన్ని విడిచి ఆ లోకానికీ, దాని ఆనందాలకోసము తొరగా ప్రయాణమవుతున్నవాళ్లు యెవరూ కనుపించరు.— చలం